



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- హైదరాబాద్‌లో ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్
- ఉమ్మడి ఖమ్మం జిల్లావాసి లక్ష్మీస్రవంతికి ద్వితీయ బహుమతి

7



ఉత్తర ద్వారం తెరుచుకున్నది ఇలా..



దక్షిణ అయోధ్య వైకుంఠ శోభతో పులకించింది. ఉత్తరద్వారంలో జగదభిరాముడే వైకుంఠ ధాముడిగా దర్శనమిచ్చారు. స్వామిని దర్శించిన భక్తజనం తన్మయత్వంతో పరవశించారు. ముక్కోటి దేవతలు వైకుంఠంలో శ్రీ మహావిష్ణువును దర్శించుకునే ఘడియల్లో వేద పండితుల మంత్రోచ్ఛారణలు.. ధూపదీపారాధనల నడుమ జేగంటలు మోగుతుండగా సరిగ్గా శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు భద్రాద్రి దేవస్థానం ఉత్తరద్వారం తెరుచుకోవడంతో 'జై శ్రీరామ్' అంటూ నినదిస్తూ భక్తజనం గరుఢ వాహన రూఢుడైన శ్రీరాముడిని దర్శించుకున్నారు.



తిరువీధి సేవ

ఉత్తరద్వారంలో దర్శనమిచ్చిన రామయ్యను తిలకిస్తున్న భక్తులు



రామయ్యను దర్శించుకుంటున్న మంత్రి తుమ్మల



డ్రమ్స్ వాయిస్తున్న యువతి

జగదభిరాముడు వైకుంఠధాముడై..

- భద్రాద్రిలో కనులపండుగా ఉత్తరద్వార దర్శనం
- మహావిష్ణువు అవతారంలో సాక్షాత్కరించిన శ్రీరాముడు
- దర్శించుకున్న మంత్రి తుమ్మల, ఎంపీ, ఎమ్మెల్యేలు, న్యాయాధికారులు
- చలువచప్పర వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ
- ముక్కోటి ఏకాదశికి భారీగా తరలివచ్చిన భక్తులు

భద్రాచలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున ఉత్తరద్వారంలో గరుడ వాహనరూఢుడైన శ్రీరామచంద్రుడు శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష ఆరాధన నిర్వహించారు. అలాగే శ్రీరామ షడక్షరీమంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన చేశారు. చతుర్వేదాలు, రామాయణం, దివ్య ప్రబంధ విన్నపాలు చేశారు. ఈ క్రమంలో శరణాగతి గద్య, గరుడ దండకం, భక్త రామదాసు రచించిన దాశరధి శతకం పఠించారు. వైకుంఠ రామునికి అష్టోత్తర శతహారతి (108 వత్తుల హారతి)తో మంగళ శాసనం సమర్పించారు.

వైభవోపేతంగా తిరువీధిసేవ

ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చిన వైకుంఠ ధాముడు అనంతరం తిరువీధిసేవకు తరలివెళ్లారు. చలువచప్పర వాహనంపై పెరియాళ్వార్, (మిగతా 6వ పేజీలో)

ఏడేళ్ల చిన్నారిపై లైంగికదాడి

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

లక్ష్మీదేవిపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తినుబండారాలు ఇప్పిస్తానని నమ్మించి అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిపై 48 సంవత్సరాల వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లిలో జరిగింది. మండలంలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన మెస్‌లో కొన్నేళ్లుగా కుకింగ్ విభాగంలో పని చేస్తున్న ఓ కుటుంబం.. అక్కడే నివాసం ఉంటోంది. అదే కుకింగ్ సెక్షన్‌లో వి.రవి అనే వ్యక్తి శుక్రవారం అక్కడి వారందరూ పరిసర ప్రాంతంలో పనుల్లో ఉండగా, అక్కడే ఉన్న చిన్నారికి తినుబండారాలు ఇస్తానని నమ్మించి ఓ గదిలోకి తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారి నోరుమూసి లైంగికదాడికి పాల్పడ్డాడు. తరువాత చిన్నారి ఏడుస్తూ రావడంతో ఏం జరిగిందని తల్లిదండ్రులు ప్రశ్నించారు. దాంతో జరిగిన విషయాన్ని చెప్పడంతో అక్కడే ఉన్న నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పండుగ వేళ ప్రయాణికులకు షాక్

- ప్రత్యేక బస్సుల్లో 50 శాతం టికెట్ రేట్ల పెంపు
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు తగ్గించారని ఆరోపణలు

ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. పండుగ సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సుల్లో చార్జీలు పెంచబోమని ముందుగా ప్రకటించిన ఆర్టీసీ తాజాగా రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఆర్టీసీ 1030 (మిగతా 6వ పేజీలో)



సత్తుపల్లిలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రవాణా సౌకర్యాల పెంపునకు కృషి

- కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి
- వచ్చే వానాకాలం సీజన్‌కు సత్తుపల్లికి గోదావరి జలాలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6



కొత్తగూడెం ఎయిర్‌పోర్టుపై కదలిక

- స్థల పరిశీలనకు ఈ నెల 20న కేంద్ర బృందం రాక
- కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో సర్వే
- సాధ్యాసాధ్యాలపై ఇచ్చే నివేదికపైనే ఎయిర్‌పోర్టు భవితవ్యం

6

సక్రమమా.. అక్రమమా?

- డిసెంబరు 28న వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 89 రిజిస్ట్రేషన్లు
- వాటిలో 64 ప్లాట్లు ఒక వెంచర్‌కు చెందిన వారివే..
- నాలుగు రిజిస్ట్రేషన్లలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు
- భాగస్వాముల మధ్య తలెత్తిన విభేదాలతో రచ్చకెక్కిన వ్యవహారం
- రెవెన్యూశాఖ మంత్రికి ఫిర్యాదు చేసిన ఓ భాగస్వామి
- రిజిస్ట్రేషన్లన్నీ సక్రమమే: వైరా సబ్‌రిజిస్ట్రార్ రామచంద్రయ్య

వైరా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే వెంచర్‌కు సంబంధించి అధికసంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేయడం వివాదాస్పదమైంది. ఈ రిజిస్ట్రేషన్ల వెనుక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ గత డిసెంబరు 28న అర్ధరాత్రి వరకు ఒక్కరోజులోనే 89 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటిలో కొణిజర్ల మండలంలోని ఒక వెంచర్‌లోని 64 ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. వాటిలోనే అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రిజిస్ట్రేషన్లపై సదరు వెంచర్‌లోని భాగస్వాముల్లో ఒకరు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాంతో ఈ రిజిస్ట్రేషన్లపై విచారణ చేయాలని రెవెన్యూశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించినట్లు సమాచారం.



గతేడాది డిసెంబరు 28 అర్ధరాత్రి వరకు వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 89 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటిలో ఒక వెంచర్‌కు చెందిన 64 ప్లాట్లలో 60 ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ అనుమతి ఉండటంతో రిజిస్ట్రేషన్‌లు సక్రమంగానే జరిగాయి. కానీ మిగిలిన నాలుగు రిజిస్ట్రేషన్లలోనే మతలబు జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నాలుగు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలోనే సుమారు తొమ్మిది ఎకరాల పైచిలుకు భూమి అంటే 45,321.95గజాల స్థలాలు ఉన్నాయి. ఒక రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పార్ట్-1లో 14,182గజాలు, పార్టు-2లో 14,149 గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ అయ్యింది. అలాగే మరో డాక్యుమెంట్ పార్టు-1లో 3417.75 గజాలు, పార్టు-2లో 6417 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. మరో రిజిస్ట్రేషన్ (మిగతా 6వ పేజీలో)

పూసుగుంటకు మహర్దశ

- మంత్రి తుమ్మల చొరవతో గ్రామ సమగ్రాభివృద్ధికి శ్రీకారం
- భద్రాద్రి కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ
- ఎమ్మెల్యే జారె పర్యవేక్షణలో అభివృద్ధి పనులు వేగం

6



ఉత్తరద్వారంలో రామయ్య

- స్వామివారిని తిలకించి పులకరించిన భక్తులు
- అధిక సంఖ్యలో హాజరైన జనం
- వైకుంఠధాముడిని దర్శించుకున్న మంత్రి తుమ్మల

వైకుంఠ ఏకాదశి సందర్భంగా భద్రాద్రి రామాలయంలో స్వామివారు ఉత్తరద్వారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున గరుఢ వాహన రూఢుడైన రామయ్యను దర్శించుకొని పునీతులయ్యారు. శ్రీరామచంద్రమూర్తి భక్తులకు శ్రీమహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్తరద్వారంలో స్వామి వారిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఇందుకోసం ఆయన శుక్రవారం తెల్లవారుజామున భద్రాద్రి చేరుకొని ఉత్తరద్వారం వద్ద స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిచ్చిన వైకుంఠ ధాముడు అనంతరం తిరువీధి సేవకు తరలివెళ్లారు. మేళతాళాలు, భాజభజంత్రీలు, కోలాటాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య తిరువీధి సేవ శోభాయమానంగా సాగింది.





స్వామి వారికి తిరువీధి సేవ



స్వామి వారిని తిరువీధి సేవకు తీసుకెళ్తున్న దృశ్యం



రామయ్యను తిలకిస్తున్న భక్తులు



హాజరైన మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం ఎయిర్‌పోర్టుపై కదలిక

- స్థల పరిశీలనకు ఈ నెల 20న కేంద్ర బృందం రాక

కొత్తగూడెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సర్వే నిర్వహించేందుకు ఈ నెల 20న కొత్తగూడెంలోని పలు మండలాల్లో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటించనున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ సాధ్యాసాధ్యాల పరిశీలనకు ప్రత్యేక బృందం రావాల్సి ఉంటుందని, అందుకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కేంద్ర మంత్రి తెలపడంతో మంత్రి తుమ్మల వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి ఈ విషయాన్ని వారికి వివరించారు. తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి అందుకు అవసరమయ్యే నిధుల విడుదలకు ప్రత్యేక జీవో విడుదల చేశారు. దాంతో ఎయిర్‌పోర్ట్ స్థల పరిశీలనకు కేంద్ర బృందాలు విచ్చేస్తున్నాయి.

రూపురేఖలు మారనున్న కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా రూపురేఖలు మారతాయని, వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

వాణిజ్యపరంగా, పర్యాటకపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తుందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం, సింగరేణి గనులకు పేరుగాంచిన కొత్తగూడెం, అశ్వాపురంలో భారజాల పరిశ్రమకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు సైతం వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేంద్ర బృందం పర్యటనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూడాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ని తుమ్మల ఆదేశించారు.

రెండో రోజు కొనసాగిన ఏరు పండుగ ఉత్సవాలు

ఆకట్టుకున్న చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు



భద్రాచలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని నిర్వహిస్తున్న ఏరు ది రివర్ ఫెస్టివల్‌లో భాగంగా రెండోరోజు గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు, భక్తిగీతాల ఆలపన, వివిధ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలను భక్తులు, పట్టణవాసులు, క్యాంపు సైట్‌లో బస చేసేవారు తిలకించారు. అలాగే ముక్కోటి సమయం కావడంతో పట్టణవాసులతో రామాలయం పరిసరాలు, గోదావరి ఒడ్డున అధిక సంఖ్యలో భక్తులు సంచరిస్తూ రామాలయ విద్యుత్తు అలంకరణ, షాపింగ్ చేస్తూ కనిపించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావుతో పాటు ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. కాగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఐఏఎస్‌ల భేటీ ఉన్న నేపథ్యంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్ హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో డివిజన్ అధికార యంత్రాంగం ఏరు పండుగ సంబురాలను పర్యవేక్షిస్తోంది. మూడు రోజుల పాటు ఏరు ది రివర్ ఫెస్టివల్ నిర్వహిస్తుండగా శనివారంతో ముగియనుంది.

రవాణా సౌకర్యం పెంపునకు కృషి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం-పాల్వంచ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలంలో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రవాణా సౌకర్యం మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా రైల్వేలైన్ల నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. భద్రాచలం, సత్తుపల్లి మీదుగా కొవ్వూరు వరకు రైల్వేలైన్, పెనుబల్లి మీదుగా కొండపల్లి వరకు రైల్వేలైన్ల నిర్మాణం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఈ నెలలో ఏవీయేషన్ అధికారుల బృందం పర్యటించనుందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్తగా వ్యవసాయ సహకార సంఘాలు అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించనున్నామని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించిన ఘనత ఉందన్నారు.

పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు నిధులు మంజూరుచేసి మంత్రి తుమ్మల పనులను తిరిగి ప్రారంభించారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. యాతాలకుంట వద్ద టన్నెల్ త్వరలో పూర్తవుతుందన్నారు. దీనిద్వారా వచ్చే సీజన్‌కు గోదావరి జలాలు సత్తుపల్లి నియోజకవర్గానికి అందే అవకాశం ఉందన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ నిధులు, చెక్‌డ్యామ్, ఆయకట్టు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరుకు సహకరించాలని ఆమె మంత్రి తుమ్మలను కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీవో గంగాధర్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమమా.. అక్రమమా?

(5వ పేజీ తరువాయి)

డాక్యుమెంట్‌లో 5237గజాలు, మరో డాక్యుమెంట్ పార్టు-1లో 1839.2 గజాలు, 80గజాల స్థలాలను రిజిస్ట్రేషన్ చేశారు. ఈ 45,321.95గజాల స్థలాన్ని ప్లాట్ల వారీగా కాకుండా సాంకేతికంగా ఉన్న అవకాశాన్ని అడ్డం పెట్టుకొని గజాల్లో రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి అధికారులు భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఈ స్థలాలకు ఎల్‌ఆర్‌ఎస్ అవసరం లేదని, ఇప్పటికే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి అనుమతులు పొందారని నాలా పన్ను కూడా చెల్లిస్తున్నందున రిజిస్ట్రేషన్‌కు ఎల్‌ఆర్‌ఎస్ అడ్డంకి కాబోదని రిజిస్ట్రేషన్లు చేసినట్టు సమాచారం.

భాగస్వాముల మధ్య విభేదాలతో..

కొణిజర్ల మండలంలో కొణిజర్ల, అమ్మపాలెంలలో రెండు రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. ఈ వెంచర్లకు చెందిన భూముల యజమానులు ఒక వ్యక్తికి రియల్‌ఎస్టేట్ అభివృద్ధి కోసం అప్పగించారు. అయితే కొంతకాలం నుంచి ముగ్గురు భూయజమానులకు డెవలపర్ అయిన ఒక వ్యక్తికి మధ్య వ్యాపార లావాదేవీల్లో తీవ్ర విభేదాలు తలెత్తాయి. వీరి మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఇదే సమయంలో సదరు డెవలపర్ ఒక మంత్రి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. మిగిలిన ముగ్గురు కూడా అధికార పార్టీలోని ఇతర ప్రజాప్రతినిధులను ఆశ్రయించారనే ప్రచారం జరుగుతోంది. దాంతో ఈ వ్యవహారంలో కొంత రాజకీయాలు కూడా ప్రవేశించినట్లు తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్‌లు అన్నీ సక్రమమే..
రామచంద్రయ్య, వైరా సబ్‌రిజిస్ట్రార్

గతనెల 28వతేదీన అర్ధరాత్రి వరకు చేసిన రిజిస్ట్రేషన్లు అన్నీ సక్రమమైనవే.. ఆరోజు ఒకేసారి రిజిస్ట్రేషన్లు రావడంతో ముందుగా డాక్యుమెంట్ల చెక్‌లిస్టు తయారుచేసి రాత్రి వరకు వాటిని పూర్తిచేశాం. కొణిజర్ల మండలంలోని వెంచర్‌కు డైరెక్ట్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అనుమతులున్నాయి. అందువల్ల ఎల్‌ఆర్‌ఎస్‌తో సంబంధం లేదు. అందుకే ఆ వెంచర్‌లోని స్థలాలకు రిజిస్ట్రేషన్ చేశాం. ఈ రిజిస్ట్రేషన్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదు. ఇదే విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్, ఉన్నతాధికారులకు నివేదించాం. నిబంధనలకు లోబడి సక్రమంగానే రిజిస్ట్రేషన్ చేశాను. ఎక్కడా అవినీతి, అక్రమాలకు చోటులేదు.

జగదభిరాముడు .. వైకుంఠధాముడై..

(5వ పేజీ తరువాయి)

నమ్మాళ్వార్, మరో వాహనంపై ఆండాళ్లమ్మవారు, హనుమద్ వాహనంపై లక్ష్మణస్వామి, గజ వాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై తిరువీధిసేవ సాగింది.

తొలి అభిషేకం

ఉత్తరద్వార దర్శనాన్ని పురస్కరించుకొని గురువారం అర్ధరాత్రి ముందుగా భద్రాచలం తహసీల్దారు శ్రీనివాసరావు దంపతులు రెవెన్యూశాఖ తరపున ధృవమూర్తులకు తొలి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్త రామదాసు తహసీల్దార్‌గా ఉన్న కాలం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని నేటికీ పాటిస్తున్నారు. శుక్రవారం తెల్లరుజామున 3.30గంటలకు స్వామివారికి తిరుప్పావై గోష్టి, బాలబోగం, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అనంతరం స్వామివారిని ఉత్తరద్వారం వద్దకు చేర్చి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. ఈ సమయంలో భక్తి రంజని కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న డాక్యుమెంటరీ

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవిర్భావం, ఆలయంలో జరిగే ఉత్సవాలు, అనుబంధ ఆలయాలు, ఆలయ అభివృద్ధికి సంబంధించి దేవస్థానం అధికారులు రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీ(ఆడియో, వీడియో) భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భద్రాద్రి రామయ్యకు దాతలు సమకూర్చిన అజరామరమైన ఆభరణాలు, వాటి వివరాలు, భూములు, వసతి భవన సముదాయాల వివరాలు సంక్షిప్తంగా వివరించారు. తొలిసారిగా వైకుంఠ ఏకాదశి సమయంలో దేవస్థానం డాక్యుమెంటరీని ప్రదర్శించడాన్ని భక్తులు అభినందించారు.

పలువురు ప్రముఖుల రాక

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామివారిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఇందుకోసం ఆయన శుక్రవారం తెల్లవారుజామున భద్రాద్రి చేరుకొని ఉత్తరద్వారం వద్ద స్వామివారిని దర్శించారు. అనంతరం ఉత్తరద్వారం ద్వారా ప్రధాన ఆలయంలోని మూలవరులను సైతం దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం వైదిక సిబ్బంది మంత్రి తుమ్మలకు శాలువ, స్వామివారి ప్రసాదంను అందజేశారు.

అలాగే మహబూబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు సైతం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి, వారి కుటుంబ సభ్యులు ఉత్తరద్వారంలో స్వామివారిని దర్శించి అనంతరం మూలవరుల దర్శనం చేసుకున్నారు. భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ సైతం ఉత్తరద్వారంలో స్వామివారిని దర్శించుకున్నారు.

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఆర్డీవో దామోధ్యర్ రావు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చివరగా భద్రాద్రి కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఇతర అధికారులు స్వామివారిని క్యూలైన్లో వెళ్లి దర్శించుకున్నారు.



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

రాపత్తు ఉత్సవాలు ప్రారంభం

- తొలిరోజు ఏఎస్పీ కార్యాలయంలో స్వామివారికి సేవ

భద్రాచలం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా పగల్‌పత్తు ఉత్సవాలు ముగియడంతో శుక్రవారం రాత్రి స్వామివారికి రాపత్తు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాపత్తు ఉత్సవం తొలి రోజున ఏఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని ఆలయం నుంచి ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఐ సంజీవరావు తీసుకొచ్చారు. అనంతరం ఏఎస్పీ కార్యాలయంలో అలంకరించిన వేదికపై స్వామివారిని ఆసీనులను చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, సీఐ సంజీవరావు, ఎస్ఐలు మధుప్రసాద్, పీవీఎన్‌రావు, విజయలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు. ఇదిలాఉండగా రాపత్తు ఉత్సవాలు 20వరకు నిర్వహించనున్నారు.

పూసుగుంటకు మహర్దశ

అశ్వారావుపేట/ దమ్మపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే అదో మారుమూల గ్రామం. పూర్తిగా కొండరెడ్లు నివసించే గ్రామం.. అదే దమ్మపేట మండలంలోని పూసుగుంట గ్రామం. పూర్తిగా వెనుకబాటుతనంలో ఉన్న ఈ గ్రామాన్ని గత గవర్నర్ తమిళిసై దత్తత తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామంపై మంత్రి తుమ్మల దృష్టి సారించారు. గ్రామాన్ని మండల కేంద్రానికి అనుసంధానం చేయాలనే సంకల్పంతో వినాయకపురం రోడ్డు నుంచి పూసుగుంట మీదుగా కటుకూరు వరకు బీటీ రహదారి, కల్వర్టుల నిర్మాణం కోసం 8ఏళ్ల క్రితం రూ.30కోట్లు మంజూరు చేశారు. కొంత మేర బీటీ రహదారి, మిగిలినది మట్టి రోడ్లు నిర్మాణం జరిగింది. ఆ తరువాత అటవీశాఖ అభ్యంతరాలతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

మరోమారు పనుల్లో వేగం...

ఏడాది క్రితం తుమ్మల నాగేశ్వరరావు తిరిగి మంత్రిగా రావడంతో మరలా పూసుకుంట గ్రామం, కొండరెడ్ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధను వహిస్తున్నారు. పూసుగుంటకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం, వెనుకబడి ఉన్న కొండరెడ్లను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా గత నెల 14వ తేదీన ఎమ్మెల్యే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో తో కలసి పూసుగుంటను సందర్శించారు. గ్రామస్థుల సమస్యలు తెలుసుకొని పూసుకుంట, గ్రామస్థుల అభివృద్ధికి ఏమి చేయాలనేదానిపై ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళికను అమలు పరచేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక కమిటీని వేశారు. రెండు నెలల్లో గ్రామానికి కావాలసిన మౌలిక వసతులను పూర్తిచేయాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే ఆదినారాయణ ఈ పనులన్నింటిని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో గ్రామంలో మౌలిక వసతులు, కొండరెడ్లు వ్యవసాయానికి అవసరమైన పనులు వేగాన్ని అందుకున్నాయి. కొండరెడ్ల జీవన ప్రమాణాలు మారాలంటే పోడు వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇటీవలే ఎమ్మెల్యే ఆదినారాయణ పూసుకుంటలో 12 వ్యవసాయ బోర్లు వేయడం జరిగింది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్‌లైన్లను విద్యుత్ అధికారులు ఆగమేఘాలమీద పూర్తి చేశారు. రహదారి పనులు ప్రారంభించారు. అటవీశాఖ అనుమతులు వేగంగా వచ్చేలా చర్యలు చేపట్టారు.

నేడు మంత్రి తుమ్మల రాక

పూసుగుంటలో చేపట్టిన బోర్లు, విద్యుత్ లైన్లు, మోటార్లును శనివారం మంత్రి తుమ్మల ప్రారంభించనున్నారు. పూసుగుంట రహదారిపై వివిధ ప్రదేశాలలో గుర్తించిన మూడు వంతెనల పనులకు మంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. వీటిలో పాటు 12 బోర్లు కింద పామాయిల్ తోటలు వేసి వాటిని ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉపాధిహామీ పథకం ద్వార రైతుల పొలంలో పామాయిల్ మొక్కలు వేసేందుకు గోతులు తవ్వారు. ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ తోటలను వేశారు. వీటితో పాటు కొండరెడ్ల జీవన ప్రమాణాన్ని పెంచేందుకు అవసరమైన ఇతర సదుపాయాల కల్పనను ప్రణాళికబద్ధంగా చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



పూసుగుంటలో వ్యవసాయ బోర్లు వేస్తున్న దృశ్యం

పండుగ వేళ ప్రయాణికులకు షాక్

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక బస్సులను నడుపుతోంది. 10, 11, 12, 13, 14 తేదీల్లో నడిసే ఈ ప్రత్యేక బస్సుల్లో 50శాతం చార్జీలు పెంచింది. పండుగ అనంతరం ఈ నెల 15 నుంచి 20వ తేదీల్లో నడిసే ప్రత్యేక బస్సుల్లోనూ చార్జీలు పెంచటంతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉన్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను తగ్గించి వాటి స్థానంలో డీలక్స్ సూపర్ లగ్జరీ, రాజధాని తదితర ఏసీ బస్సులను తీసుకొచ్చి మహిళలకు ఉచిత ప్రయాణం లేకుండా చేస్తున్నారని పలువురు మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు సాధారణ టికెట్ రూ.490 ఉండగా ప్రత్యేక బస్సుల్లో రూ.735వరకు వసూలు చేస్తున్నారు. గ్రామాలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్యను తగ్గించి ఆ బస్సులను ప్రత్యేక బస్సుల పేరిట అదనపు చార్జీలను ప్రయాణికుల నుంచి లాగుతున్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, సూర్యాపేట, భద్రాచలం తదితర ప్రాంతాలకు అదనపు బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలను వసూలు చేస్తున్నారు. శుక్రవారం ముక్కోటి సందర్భంగా భక్తులు భద్రాచలం అధికంగా వస్తారని తెలిసి ఆ రూట్లలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు సంఖ్యను తగ్గించి డీలక్స్ రాజధాని బస్సులను నడిపారు.





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన లక్ష్మీ ప్రవంతి



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

తరగతిలో సె(స్కా)ల్లు

- చెట్ల కింద విద్యార్థులు
- ఎనిమిది మంది ఉపాధ్యాయులకు ముగ్గురే హాజరు
- బెండాలపాడు పాఠశాలలో పరిస్థితి ఇదీ..



చేతిలో ఫోన్‌తో ఉపాధ్యాయుడు

చండ్రుగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బెండాలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యాబోధన అధ్వానంగా సాగుతోంది. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కావటం లేదని, వచ్చినా సెల్‌ఫోన్లలో కాలక్షేపం చేస్తున్నారని శుక్రవారం గ్రామస్థులు విలేకరులకు సమాచారం ఇచ్చారు. దీంతో విలేకరులు పాఠశాలకు వెళ్లి చూడగా ఒక ఉపాధ్యాయుడు చెట్టుకింద, చెత్తకుప్ప పక్కన విద్యార్థులకను కూర్చోబెట్టి సెల్‌ఫోన్‌లో వీడియోలు చూడటంలో నిమగ్నమయ్యాడు. పాత్రికేయులు ఫొటోలు తీస్తున్న విషయాన్ని కూడా సదరు ఉపాధ్యాయుడు గమనించక పోవటం గమనార్హం. ఈ సమయంలో పాఠశాలలో ఎనిమిది మంది ఉపాధ్యాయులకు ముగ్గురే ఉన్నారు. వారు కూడా జీన్స్ ప్యాంట్లు, టీషర్టులతో దర్శనమిచ్చారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు రమేష్‌ను వివరాలు కోరగా నలుగు ఉపాధ్యాయులు సెలవు పెట్టారని, మరో ఉపాధ్యాయుడు కడుపు నొప్పితో వెళ్లిపోయాడని తెలిపారు. మరి సెల్‌ఫోన్, జీన్స్ ప్యాంట్లు, టీషర్టులతో తరగతి గదులకు వెళ్లకూడదగా అని అనగా ఏమవుతుందిలే అని సమాధానం ఇచ్చారు. కాగా పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా జరగటంలేదని, 60 మంది విద్యార్థులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నా నిత్యం కొందరు ఉపాధ్యాయులు గైర్హాజరు అవుతున్నారని గ్రామస్థులు తెలిపారు. దీనిపై ఎంఈవో సత్యనారాయణను వివరణ కోరగా అంతమంది ఒకేసారి సెలవు పెట్టకూడదని, సెల్ ఫోన్ వినియోగించకూడదని, డ్రస్ నిబంధనలు పాటించాలని తెలిపారు. నిబంధనలు పాటించని ఉపాధ్యాయులపై చర్య తీసుకుంటానని ఎంఈవో తెలిపారు.



చెత్తకుప్ప పక్కన కూర్చున్న విద్యార్థులు

మాచినేనిపేట తండాలో పట్టపగలే చోరీ

- తండ్రి, కుమారుల ఇళ్లల్లో నగదు, బంగారం మాయం

జూలూరుపాడు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపేట తండాలో గుర్తుతెలియని వ్యక్తులు తండ్రి, కుమారుల ఇళ్లల్లో చోరీలకు పాల్పడి నగలు, నగదును ఎత్తుకువెళ్లారు. శుక్రవారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాచినేనిపేటతండా గ్రామానికి చెందిన మాలోత్ రాగ్యా, అతడి కుమారులు మాలోత్ సోమ్లా, నాగేశ్వర రావు పక్కపక్కనే మూడు పూరిగుడిసెల్లో నివాసముంటున్నారు. గురువారం రాగ్యా, అతడి భార్య, కొడుకు, కోడళ్లు ఇళ్లకు తాళాలు వేసి కూలి పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి బీరువాల్లో ఉన్న వాటిని ఎత్తుకు వెళ్లారు. రాగ్యా ఇంట్లో రూ. 1.30లక్షల విలువ చేసే నల్లపూసల గొలుసు, పుస్తెల బిళ్లలు, చెవుల దిద్దులతో పాటు రూ. 6వేల నగదును మాలోత్ సోమ్లా ఇంట్లో ఏడు తులాలకు సంబంధించిన మూడు వెండి బ్రాస్‌లైట్లు, 20 తులాల పట్టీలు అపహరించుకుని వెళ్లారు. రాగ్యా పెద్ద కుమారుడు నాగేశ్వరరావు చనిపోవడంతో కోడలు కరుణ ఒంటరిగా ఉంటోంది. ఆమె ఇంట్లోబీరువాలో దాచిన బంగారపు ఉంగరం, 30తులాల వెండి పట్టీలు, రూ. 10వేల నగదును ఎత్తుకు వెళ్లారు. చోరీ జరిగిన విషయాన్ని బాధితుడు సోమ్లా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని ఎస్సై బి.రవి సందర్శించారు. చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలించారు.

నగదు, బంగారం ..

కామేపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగలు చొరబడి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంనన పింజరమడుగు గ్రామానికి చెందిన గుండ్లపల్లి ఎల్లమ్మ కూలీ పనుల నిమిత్తం పనికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు గురువారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉన్న బీరువా తాళంతెరిచి అందులో ఉన్న రూ.16వేలు నగదు, రూ.40వేల బంగారం నగలను అపహరించారు. దీంతో ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కామేపల్లి ఎస్‌ఐ బి.సాయి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ఖమ్మంక్రైం, జనవరి10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కంట్రోల్ రూంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హెచ్. కోక్యా కుటంబసభ్యులకు రూ.8లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ అందజేశారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడారు. బాధిత కుటుంబానికి పోలీసు శాఖాపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైనా అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా కుటుంబాలకు దూరంగా ఉంటున్న పోలీసులు ప్రజల సేవలో తరిస్తున్నారని అన్నారు.

యువకుడి ఆత్మహత్య

చుంచుపల్లి, జనవరి10(ఆంధ్రజ్యోతి): చెట్టుకి ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి టూటౌన్ సీఐ రమేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామవరం ప్రాంతంలోని వనందాస్ గడ్డ బస్తీకి చెందిన అవివాహితుడు ఇర్రి అవినాష్(29) ఆటో నడుపుకొని జీవిస్తున్నాడు. గత మూడేళ్లుగా అనారోగ్య బారిన పడిన తండ్రి మంచానికి పరిమితం అవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటి పోషణ చూసుకునే అవినాష్ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. జీవితం మీద విరక్తి చెంది, అతిగా మద్యం సేవించి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అవినాష్‌కు తల్లి, తండ్రి, సోదరుడు ఉన్నాడు. తల్లి ఎర్రి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్యాంకర్, కారు ఢీ..

ఖమ్మంక్రైం, జనవరి10 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్, కారు పక్కపక్కన వెళుతూ ఢీకొన్న ప్రమాదంలో కారు ధ్వంసమయింది. ఈసంఘటన శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కూసుమంచి నుంచి వైరా వైపు వెళుతున్న ఓ కారు, అదే సమయంలో ఖమ్మం నుంచి వైరా వైపు వెళుతున్న ఓ ట్యాంకర్ త్రిబుల్‌ఆర్ ఫంక్షన్‌హాల్ వచ్చాయి. ట్యాంకర్‌ను దాటే క్రమంలో కారు ట్యాంకర్‌కు తగిలింది. దీంతో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమయింది.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

సత్తుపల్లిరూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని బేతుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఐనంపూడి కాంతమ్మ, రమేష్ దంపతుల పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకోగా ఇంట్లోని వస్తువులు అన్ని 90శాతం మేర అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు అంటుకోగా ప్రాణాపాయం తప్పింది. సుమారు రూ.2లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లగా ఫైరింజన్ వచ్చి మంటలు వ్యాపించకుండా ఆర్పగలిగింది.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

లక్ష్మీదేవిపల్లి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): గాలిపటం ఎగురవేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై బాలుడు గాయాలపాలైన సంఘటన శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం పంచాయతీలో చోటుచేసుకుంది. 12 ఏళ్ల వయస్సు గల వంశీ స్కూల్ నుంచి ఇంటికి చేరుకుని భవనం పైకి వెళ్లి గాలిపటం ఎగురవేస్తున్నాడు. దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించారు.

చెల్లని చెక్కుకేసులో ఏడాది జైలు

ఖమ్మం లీగల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఖమ్మానికి చెందిన జి.కరుణకు ఖమ్మం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏపూరి బిందు ప్రియ ఏడాది జైలుశిక్షతో పాటు రూ.3.5లక్షల జరిమానా చెల్లించాలని శుక్రవారం తీర్పు చెప్పారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన వారి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అంజలి

ఖమ్మం క్రైం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ సీఐ అంజలి తెలిపారు. పట్టుబడిన నిందితులను చూపుతూ శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. రైల్వే స్టేషన్‌లోని రెండో ప్లాటుఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన కొమ్ము రామకృష్ణ, సీతంపేట గ్రామానికి చెందిన పోలూరి పవన్ కుమార్ అనుమానంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఈనెల 2న విజయవాడ నుంచి వస్తున్న ఓ రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి మెడలో బంగారు గొలుసు మధిర సమీపంలో లాక్కొని పారిపోయినట్లు తెలిపారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అంజలి తెలిపారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న కారు

- ఐదుగురికి గాయాలు

పాల్వంచ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం జగన్నాథపురానికి చెందిన అడపాల లక్ష్మీదేవమ్మ, శ్రావణపు పద్మ, బానోతు లాలు, సుకుమార్ పాల్వంచ రావడానికి ధర్మపురి రామారావు ఆటో ఎక్కారు. తోగ్గూడెం క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఆటోను నిలిపి రామారావు మరో ప్యాసింజర్ కోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తగూడెం పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామారావు భద్రాచలం నుంచి తన కారులో పాల్వంచ వస్తున్నాడు. తోగ్గూడెం క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే వేగాన్ని నియంత్రించకపోవడంతో కారు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసం అయింది. ఆటోలో అప్పటికే కూర్చుని ఉన్న నలుగురికి గాయాలవగా వెనుక వస్తున్న పోలీసులు, స్థానికులు వారిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ఆటో డ్రైవర్ రామారావు తలకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవమ్మను భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయలవడంతో స్థానిక ఆసుపత్రిలోనే చికిత్స అందించారు. ఈ ఘటనపై పాల్వంచ రూరల్ ఎస్‌ఐ సురేష్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పార్కుల్లో పరికరాలకు మరమ్మతులు



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి10 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా గొల్లగూడెం పార్కులో వ్యాయామ పరికరాలు మరమ్మతులు చేయలేదు. కాగా శుక్రవారం మరమ్మతులు చేశారు. డంపింగ్‌యార్డులో గుర్రైన విద్యుత్ మోటారు మరమ్మతులు పూర్తి చేశారు. ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన 'చెత్తశుద్ధి కరువు' కథనంపై కేఎంసీ అధికారులు కదలిలారు. డంపింగ్‌యార్డులు, పార్కులు, ఓపెన్ జిమ్‌ల నిర్వాహణపై దృష్టి సారించారు.

నేలకొండపల్లిలో నేడు విద్యుత్ కోత

నేలకొండపల్లి,జనవరి10(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయ బడుతుందని ఏఈ కె.రామారావు శుక్ర వారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకొత్తూరు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని కొత్తకొత్తూరు, నేల కొండపల్లి, పాతకొత్తూరు, తిరుమలా పురం, పైనంపల్లి, బోదులబండ, రామ చంద్రాపురం, అనంతనగర్, కోరట్ల గూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి

కామేపల్లి,జనవరి10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యులపై దాడులను ఆపాలని గ్రామీణవైద్యుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మడంల పరిధిలోని కొత్తలింగాలలో గ్రామీణ వైద్యుల సహాయక సంఘ 25వ వార్షి కోత్సవాన్ని మండల అధ్యక్షుడు బందెల నాగేశ్వరరావు అధ్యక్షతన జరి గింది. అనంతరం క్యాలెండర్‌ను ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో మహ బూబ్‌రెడ్డి, జిల్లానాయకులు సుందర్ రావు,అమృతరావు,లక్ష్మన్‌చారి,అప్పారా వు, రాము, రమేష్, కె.శ్రీనివాస్, రాధక్రి ష్ణ,ఇమామ్, వీరబాబు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగే శ్వరరావు కృషి చేస్తున్నారని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్ర వారం ఖమ్మం నగరంలోని 30, 32, 33, 34, 36, 37, 48 డివిజన్లలో మేయర్ పర్యటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మంజూరైన చెక్కులను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పంపిణీ చేశారు. సంక్షేమ కార్యక్రమాలను వారికి వివ రించారు. మాజీకార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

తుదిదశకు విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలు

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి10(ఆంధ్రజ్యోతి):నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర ట్రాన్స్‌కో, డిస్కమ్స్ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, లాన్‌టెన్నిస్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శుక్రవారం జరిగిన టెన్నిస్ పోటీలో ఇప్పటికే కరీం నగర్ ట్రాన్స్‌కో జట్టు ప్రథమ స్థానం సాధించగా, హైదరాబాద్ విద్యుత్‌సౌధ ద్వితియ, కార్పొరేట్ ఆఫీస్ హైదరా బాద్ జట్టు తృతియ బహుమతులు సాధించాయి. టెన్నిస్‌వ్యక్తిగత విభాగం తుది పోటీలు శనివారం జరగను న్నాయి. ఫుట్‌బాల్ విభాగంలో ఖమ్మం ఆపరేషన్స్, కరీంనగర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా తుది పోటీలు శనివారం నిర్వహించనున్నారు. రెండోరోజు పోటీ లను ట్రాన్స్‌కో స్పోర్ట్స్ అధికారి ఎన్. జగన్నాధ్, స్పోర్ట్స్ సెక్రెటరీ ఏడీఈ బాబూనాయక్, డీఈలు నాగరత్నం, అప్పారావు తదితరులు సమీక్షించారు.

సీపీఎం కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం,జనవరి10(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ఆధ్వర్యంలో కార్యవర్గసభ్యులుగా కొమ్ము శ్రీను, అంగిరేకుల నరస య్య,పి.సుధాకర్,మంగతాయి, బింగి. రమేష్,కొత్తపల్లి వెంకన్న, మహీందర్, మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తిరుమలాయపాలెం,జనవరి10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై శుక్రవారం తిరుమలాయపాలెం పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ రామలింగారెడ్డి మోసగాళ్ల ఫోన్‌చేసినప్పుడు వెంటనే సైబర్‌క్రైం ఉచితకాల్ నెంబరు 1930కు కాల్‌చేయాలన్నారు.

న్యూవిజన్‌లో హిందీ దివస్

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి10(ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేత లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అకాడ మిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సి పాల్ అబాద్ అలీ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్‌లో

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా భాష ప్రాముఖ్యతను వివరించారు.

ఇళ్ల కేటాయింపుపై నిరసన

- ఓ నాయకుడి ప్రోద్బలంతో అనర్హులకు కేటాయింపు
- అచార్లగూడెంలో ప్రజల ఆందోళన
- న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నేలకొండపల్లి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆచార్లగూడెంగ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో రాజకీయం నడిచింది. ఈనేపథ్యంలో లబ్ధిదారులు శుక్రవారం ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో గ్రామంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో 18 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించేందుకు అధికారులు సిద్ధం చేశారు. లబ్ధిదారుల ఎంపికను ప్రారంభించిన అధికారులు మొత్తం 21మందిని అర్హులని ఎంపిక చేశారు. అందులో నుంచి శుక్రవారం 18 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. లాటరీ ద్వారా ఎంపిక చేసిన వారిలో దాదాపు సగం మంది అనర్హులేనని ఆరోపించారు. శుక్రవారం గ్రామస్తులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నాకు దిగారు. అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో ఎక్కువ మంది అనర్హులే ఉన్నారని, వెంటనే లిస్టును మార్చి అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభను నిర్వహించకుండానే, గ్రామానికి చెందిన ఓ నాయకుడి ప్రోద్బలంతో అధికారులు వీరిని ఎంపిక చేశారని ఆరోపించారు. పొలాలు, స్థలాలు, ఉన్న ఉద్యోగస్తులైన కుమారులున్న వారికే పెద్దపీట వేశారని ఆరోపించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లవద్ద జరుగుతున్న పనులను అడ్డగించారు. పనులు జరక్కుండా కంచెను అడ్డుగా వేశారు. అర్హులకు కేటాయించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

న్యాయం చేస్తాం

తహసీల్దార్ జాదవ్ మాణిక్యం

ఆచార్లగూడెంలో డబుల్ బెడ్‌రూంఇళ్ల వద్ద గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎస్ఐ పెంటరి సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న మిగిలిన వారిని కూడా కలిపి, గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తహసీల్దార్ ఎస్ఐలు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఆదాయ వేటలో కేఎంసీ

- 100రోజుల్లో రూ.20కోట్ల వసూళ్లకు కార్యాచరణ
- సెల్‌ఫోన్లకు సందేశాలు, మైక్,కరపత్రాల ద్వారా ప్రచారం
- స్పెషల్ డ్రైవ్‌తో దృష్టి సారించిన కమిషనర్



ట్యాక్స్ కలెక్షన్‌ను పరిశీలిస్తున్న ఆర్వో

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి10 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరదలు, ప్రజాపాలన దరఖాస్తులు, ఇందిరమ్మ సర్వే కార్యక్రమాలతో నాలుగు నెలలుగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఆదాయ వసూళ్ల(ట్యాక్స్ కలెక్షన్)పై తీవ్ర ప్రభావం పడింది. పారిశుధ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాలు అధికారులు, ఉద్యోగులు రెగ్యూలర్ విధుల బదులుగా మున్నేరుబాధితుల గుర్తింపు, ప్రజాపాలన, ఇందిరమ్మ నివాసాల సర్వేపనులకు బృందాలుగా పని చేశారు. ఫలితంగా ఖమ్మంనగర పాలక సంస్థకు రావాల్సిన ఆదాయ వసూళ్ల గణనీయంగా తగ్గిపోయింది. నవంబరు నుంచి ప్రారంభం కావాల్సిన ఆదాయ వసూళ్ల స్పెషల్ డ్రైవ్ సిబ్బంది కొరత కారణంగా జాప్యం జరిగింది. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదాయ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

రూ. 20 కోట్ల ఆదాయ వసూళ్లు లక్ష్యంతో

కేఎంసీలో 86,400నివాస,వ్యాపార భవనాలు ద్వారా కేఎంసీకి ట్యాక్స్‌కలెక్షన్ జరుగుతుంది.ఎర్లీబర్డ్,మీసేవా కేంద్రాల ద్వారా ఇప్పటికే రూ.15.80కోట్లు ఆదాయం వచ్చింది. మరో రూ.20కోట్లు వరకు ఆదాయ వసూళ్ల జరగాల్సి ఉంది. రాబోయే100రోజుల్లో రూ.20కోట్ల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు గతంలో పనిచేసిన బిల్‌కలెక్టర్లుతో పాటుగా నూతన వార్డు ఆఫీసర్లను కమిషనర్ రంగంలోకి దింపారు.

రెడ్‌నోటీసుల జారీతో..

23మంది బిల్‌కలెక్టర్లు గతంలో బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల కాలంలో కేఎంసీకి 33మంది వార్డు ఆఫీసర్లు ప్రభుత్వం కేటాయించగా వారు బాధ్యతలు స్వీకరించారు. వారిలో మరో 23మందిని రెవెన్యూ విభాగానికి కేటాయించారు. ప్రతీ బృందం రెడ్‌నోటీసులు జారీ చేసి వారి నుంచి ట్యాక్స్ కలెక్షన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చివరకు రూ.19 కోట్ల నుంచి రూ.20 కోట్లు వరకు వసూళ్ల చేయాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు. ట్యాక్స్ చెల్లించాల్సినవారి సెల్‌ఫోన్లకు సమాచారం పంపుతున్నారు. పారిశుధ్య మైక్‌ల ద్వారా ప్రచారం ప్రారంభించారు. ఉదయం 8గంటలకే బృందాలను సర్వేకు పంపి ఆదాయ వసూళ్లపై దృష్టి సారించారు.



కమాన్‌బజార్ వెంకటేశ్వరాలయంలో భక్తుల రద్దీ, ఆలయంలో స్వామి వారి దర్శనం

వైభవంగా ముక్కోటి ఏకాదశి

- భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం
- వేకువ జామునుంచే బారులు తీరిన భక్తులు



నేలకొండపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఖమ్మంసాంస్కృతికం, జనవరి10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో సంప్రదాయ ఉత్తర ద్వార దర్శన క్రతువును అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు గురువారం అర్ధరాత్రినుంచే బారులు తీరటంతో వివిధ ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో అలరారాయి. స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదిక వద్ద ఏర్పాటు చేసి తెరలను ఏర్పాటు చేసి ధూపదీపాల మధ్య ఒక్కసారిగా తెరలను తొలగించటంతో భక్తులు స్వామి వార్లను వైకుంఠలోకంలో దర్శించుకున్న అనుభూతికి లోనయ్యారు. ఖమ్మం నగరంలో కమాన్ బజార్, ఖానాపురం హవేలి తదితర ప్రాంతాల్లోనిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు, ఎన్నెస్పీ క్యాంపులోని శ్రీరామగిరి క్షేత్రం, వైరా రోడ్‌లోని పవనసుత జలాంజనేయస్వామి దేవాలయం, ఇందినాగర్ పర్ణశాల ఆంజనేయ దేవాలయాలు, స్తంభాద్రి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, రంగనాయకుల గుట్టపై రంగనాథ స్వామి దేవాలయం ఆలయాలను భక్తులు వేలాదిగా దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కమాన్ బజార్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహాలకు ముత్యాలు, పచ్చలు, కెంపులతో దండలను, డ్రైఫ్రూట్స్‌తో రూపొందించిన కిరీటాలను మహేశ్వరీ జ్యూయలర్స్ అధినేత కృష్ణప్రసాద్ అలంకరించారు.

ఖమ్మంరూరల్: మండలంలోని అన్నిగ్రామాల్లో శుక్రవారం వైకుంఠఉత్తర ద్వార దర్శనం కన్నుల పండుగగా నిర్వహించారు. మండలంలోని తీర్థాల, మద్దులపల్లి, పోన్నేకల్లు, కాచిరాజుగూడెం, రెడ్డిపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వార్లను ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కూసుమంచి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలుకిటకిటలాడాయి.ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం భక్తులు ఉత్తరద్వారం ద్వారా శ్రీమన్నారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఇందుకోసం ఆలయాల్లో భక్తులు బారులు దీరారు.మండలంలోని నాయకన్‌గూడెంలో బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, జీళ్లచెరువులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, పాలేరు వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు ఆలయ అర్చకులు పరాంకుశ సంపత్‌కుమార్ భట్టార్, స్వామినాధ్ తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగింపు సేవ చేశారు.

13న కల్యాణం

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం నాయకన్‌గూడెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదారంగనాధుల స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సంపత్‌కుమార్ బట్టార్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



రంగనాయకులగుట్ట రంగనాథస్వామి దేవాలయంలో, జీళ్లచెరువులో స్వామివారి ఊరేగింపు, ఏదులాపురం గ్రామంలో..

రంగవల్లులు సంప్రదాయాలకు ప్రతీక

- పొంగులేటి మాధురి



విజేతకు బహుమతిని అందజేస్తున్న పొంగులేటి మాధురి

నేలకొండపల్లి, జనవరి10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినానికి తెలుగు లోగిళ్లలో రంగవల్లులు అద్దటం తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నేలకొండపల్లిలోని మోడల్ డిగ్రీకళాశాల ఎదురుగా ఉన్న ఓప్రైవేటు వెంచర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలస్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలువేసిన ముగ్గులను ఆమె పరిశీలించారు. ప్రథమ, ద్వితియ బహుమతిని నేలకొండపల్లికి చెందిన పల్లే శిల్ప, సంధ్యారాని దక్కించుకున్నారు. తృతీయ బహుతిని మంగాపురం తండాకు చెందిన తేజస్విని గెలుచుకున్నారు. వీరికి బహుమతులు అందించారు.కార్యక్రమంలో తుంబూరు దయాకర్‌రెడ్డి, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మోర మల్లయ్య, కైలాసపు వెంకటేశ్వర్లు, ఆరెకట్ల గురునాధం, కొడాలి గోవిందరావు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, బచ్చలకూరి నాగరాజు, షేక్.ఖాజాయియా, షేక్.సుభాన్, జంగం లక్ష్మీనరాయణ, రేగూరి వాసవి, యడవల్లి సైదులు, యడవల్లి నాగరాజు, గుడిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: సంస్కృతీ సాంప్రదాయల కలయికే సంక్రాంతి పండుగని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి సతీమణి శ్రీలక్ష్మీరెడ్డి తెలిపారు. శుక్రవారం పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికి బహుమతులు అందించి అభినందించారు.

విద్యాలయాల్లో వేడుకలు



ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో..



రెజోనెన్స్ ఇన్ఫోలో బోగి మంటలు



విద్యాక్షేత్రలో



క్రియేటివ్‌లో..

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

డైరీ ఆవిష్కరణలో ఎస్ఈ సురేందర్



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్ఈ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన విధంగా 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా దిశగా విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఈ కార్యాలయంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నాగార్జున కార్యదర్శి ఎం శ్రీనివాస్, నాయకులు నాగేశ్వరరావు, మమత, వెంకటేశ్వర్లు, ఫ్రాంక్లిన్, రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డుభద్రత ప్రమాణాలపై ప్రచారం కల్పించాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో ఆమె రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమీక్షించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ లిమిట్ బోర్డులను, యాక్సిడెంట్ ప్రోన్‌ఏరియా స్టిక్కర్లను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, డీపీవో ఆశాలత, డీఎంహెచ్‌వో కళావతిబాయి, ఆర్టీవో వెంకటరమణ,ఏసీపీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయ రంగంలో సంక్షోభం

కూసుమంచిలో సీపీఎం రైతుదీక్ష

కూసుమంచి,జనవరి10(ఆంధ్రజ్యోతి):కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల విధానాలతో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుక పోయిందని రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల షన్మతిరావు ఆరోపించారు. శుక్రవారం సీపీఎం, తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతునేత జగ్జిత్‌సింగ్ దాల్లేవాల్‌కు మద్దతుగా కూసుమంచి మండలకేంద్రంలో రైతుదీక్ష నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి రైతుఆత్మహత్యలు పెరిగాయన్నారు. రైతుఆత్మహత్యల నివారణకు కేంద్రం మద్దతు ధరలు పెంచాలన్నారు. పంజాబ్ హర్యాణా సరిహద్దులో నిరవదిక నిరాహరదీక్ష చేస్తున్న రైతునేత జగ్జత్‌సింగ్ ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘ నేతలు రాజశేఖర్, గంగాధర్, గురుమూర్తి, రమణారెడ్డి పాల్గొన్నారు. దీక్షకు ఎన్డీ డివిజన్ కార్యదర్శి వెంకట్రాంరెడ్డి మద్దతు పలికారు.





మధిరలో..



తల్లాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సత్తుపల్లిరూరల్ పూజల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా ముక్కోటి ఏకాదశి



ఎర్రుపాలెంలో అలంకరణలో శ్రీవారు

ముక్కోటి ఏకాదశి మహోత్సవాన్ని శుక్రవారం మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాలలో స్వామి, అమ్మవార్లకు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు స్వామిఅమ్మవార్లను ఉత్తర ద్వారదర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి. ఉత్తర ద్వారదర్శనానికి వేకువజామున నుంచే భక్తులు బారులుతీరడంతో ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎర్రుపాలెంలో శ్రీవారిని సుమారు రూ.10వేల మంది దర్శించుకున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



మధిరలో ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీసీతారామచంద్రస్వామి



కల్లూరులో..



కారేపల్లిలో..



ఏన్కూర్‌లో పూజల్లో పాల్గొన్న జిల్లా జడ్జి రాజగోపాల్



బోనకల్‌లో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



చింతకానిలో..



ముదిగొండలో...

సౌండ్ సిస్టం వితరణ

ఖమ్మం కొణిజర్ల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొణిజర్ల ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం స్నేహ హస్తాలు ఫౌండేషన్ సహకారంతో తల్లపురెడ్డి అచ్యుత విజయ జ్ఞాపకార్థం సౌండ్‌సిస్టం, పుస్తకాలు, పెన్నులు సామాగ్రిని మండల విద్యాశాఖ అధికారి ఇబ్రహం ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో స్నేహ హస్తాలు ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరీముల్లాబాబు, పాఠశాల హెచ్‌ఎం రామ్మోహన్‌రావు, మహాలక్ష్మి, పవన్, రమేష్ తదితరులు ఉన్నారు.

బోరు మోటార్ వితరణ

చింతకాని, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో శుక్రవారం దేవరపల్లి దేవిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు దేవరపల్లి సుధాకర్‌రెడ్డి గ్రామ ప్రజల అవసరాలకు, వివాహాది శుభకార్యాలు, పంచాయతీ మొక్కల పరిరక్షణకు ట్యాంకర్లకు ఉచితంగా నీటిని అందించేందుకు బోరు మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోర్ మోటారును గ్రామ పెద్దలు ఇనుకుళ్ల నాగ సురారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, చల్లా వెంకటేశ్వరరెడ్డి, వీరారెడ్డి, లింగం రాంబాబు, చంద్రయ్య పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి

వేంసూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా కల్లూరుగూడెం గ్రామానికి చెందిన గొర్ల ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభాకర్‌రెడ్డికి జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి నియామకం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

'క్రీడలతో మానసికోల్లాసం'

ముదిగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామిలు అన్నారు. శుక్రవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రజ్వల యువజన సంఘం వారు ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షుడు చింతమాల పాపయ్య, అధ్యాపకులు వెంకట్, గురవయ్య, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కారేపల్లి, జనవరి10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై కారేపల్లి నుంచి ఇల్లెందు వైపు వస్తున్న ఓ వ్యక్తి సోలార్ ప్లాంట్ వద్ద వాహనం అదుపుతప్పి కిందపడిపోయడు. దీంతో అతనికి తీవ్రగాయలు కావడంతో అతడిని ఇల్లెందు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు.

రైతునేత దలైవాల్ ప్రాణాలను కాపాడాలి

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

తల్లాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 46రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దలైవాల్ ప్రాణాలను కాపాడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. శుక్రవారం తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్లో ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు, పేరసాని వెంకటయ్య, సత్తెనపల్లి నరేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైరా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. 46రోజుల నుంచి నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్‌సింగ్ దలైవాలాకు మద్దతుగా శుక్రవారం వైరాలో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, పురుషోత్తం, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, నర్సింహాచారి, కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.

మహదేవపురం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అధికారులు

మధిర రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మహదేవపురం గ్రామంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం నీటిపారుదలశాఖ డీఈ నాగబ్రహ్మం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ పథకాన్ని సందర్శించారు. గ్రామంలో వెయ్యి ఎకరాలకు సాగునీరందించేలా పథక నిర్మాణం జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో భట్టి విక్రమార్క సహాయకులు రాజేష్, నాయకులు సూరంశెట్టి కిషోర్, దారా బాలరాజు, వంశీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు, జనవరి10(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈనెల 7నుంచి 9వరకు జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఏన్కూరు మండలం బురదరాఘవాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు కే.మహిమ, ఎస్.శ్రావణి ప్రతిభ చూపి దక్షిన భారతదేశస్థాయికి ఎంపికయ్యారు. గణిత విభాగం సీనియర్‌లో విజువలైజింగ్ మ్యాథ్స్ అనే ప్రదర్శనకు ప్రథమ బహుమతి సాధించారు. కాగా ఈ ప్రదర్శన ఈనెల 21నుంచి 25వరకు పాండిచ్చేరిలో జరుగుతుంది. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవో హెచ్.శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయశ్రీ, శ్రీనివాసరావు, పుల్లయ్య, భారతి, నరేష్, నాగేశ్వరరావు, బాల్‌సింగ్,ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాల అన్వేషణ

వైరా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్ల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయతలపెట్టిన సోలార్ ప్లాంట్ల కోసం శుక్రవారం రెవెన్యూ ఇతర శాఖల అధికారులు మండలంలో పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. ఐకేపీల ఆధ్వర్యంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్‌ప్లాంట్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వైరా, గరికపాడు, సీతానగరం సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్‌ప్లాంట్ల కోసం మూడు ప్రాంతాల్లో స్థలాల సేకరణకు అధికారులు సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, డీటీ సురేష్ బాబు, గిర్దావర్‌లు ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, ఐబీ డీఈ పి.శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏడీఈ కిరణ్, ఏఈలు సుందర్‌కుమార్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

ముువ్వాను కలిసిన ఏఐహెచ్‌ఆర్ నాయకులు

కల్లూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబును జాతీయ మానవ హక్కుల ఫౌండేషన్ కౌన్సిల్ అధ్యక్షుడు కటుకూరి రత్న తారక రాజన్న, ఉమ్మడి ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినుకొండ శ్రీనివాసరావులు శుక్రవారం మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఐహెచ్‌ఆర్ నాయకులు మాట్లాడుతూ మానవ, బాలల, మహిళల హక్కుల పరిరక్షణకు తాము చేపట్టబోయే సేవా కార్యక్రమాలకు సహకరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మువ్వాను సన్మానించారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సండ్ర



తిరుమల వద్ద సండ్ర, మహాలక్ష్మి దంపతులు

సత్తుపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మహాలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంలో దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు సండ్ర తెలిపారు.

ఎమ్మెల్యే ఆఫీసు ముట్టడి

వైరా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాల ఆశవర్కర్లు ముట్టడించారు. ఎమ్మెల్యే ఆఫీసు ప్రధాన గేటు ముందు ఆశవర్కర్లు బైఠాయించి నినాదాలతో హోరెత్తించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందికి ఒక వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు అనుమోలు రామారావు, పారుపల్లి కృష్ణారావు, కొంగర సుధాకర్, తోట నాగేశ్వరరావు, కె.నరేందర్, ఏర్పుల రాములు, బాజోజు రమణ, రాధ, పద్మ, ఝాన్సీ, నీలిమ, అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



మధిరలో ...

మధిర, వైరా, సత్తుపల్లి, నియోజవర్గాల వ్యాప్తంగా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ముందుస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



వైరాలోని వాణీ వివేకానంద విద్యాలయంలో బొమ్మల కొలువు నిర్వహించిన దృశ్యం



ఎన్టీఆర్‌నగర్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



కాకర్లపల్లిలో చెక్కు అందిస్తున్న మంత్రి తుమ్మల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సత్తుపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిలు అన్నారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బుగ్గపాడు-నాగుపల్లి రూ.1.20కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. కాకర్లపల్లిలో రూ.3.80 కోట్ల అంచనా వ్యయంతో సిమెంట్, తారురోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాకర్లపల్లిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.20లక్షలతో నిర్మించిన 200మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము, కార్యాలయాన్ని సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. సత్తుపల్లిలో చాకలి ఐలమ్మ మోడ్రన్ దోబీఘాట్ ఆవరణలో రూ.34లక్షల అంచనాతో నిర్మించనున్న గోదాముకు శంకుస్థాపన చేశారు. 59మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు మనో వికాసం ముఖ్యం: ఖమ్మం బిషప్

తల్లాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు విద్యార్థులకు మనోవికాసం ముఖ్యమని ఖమ్మం బిషప్ మోస్ట్ రేవ.ఎస్.ప్రకాష్ అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం రెడ్డిగూడెంలోని క్రీస్తుజ్యోతి జూనియర్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాదర్ కె.థామస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రతభావంతులైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాదర్‌లు శ్రీకాంత్, గోవా సౌరయ్య, సంపత్, బ్రదర్ జేవీఆర్.అమల్, కిసాన్ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ దాసరి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హామీలను అమలు చేయాలి: యూటీఎఫ్

బోనకల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్, హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని, ప్రశ్నించే గొంతుక ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని మరోసారి శాసన మండలికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు సదాబాబు, రంగారావు, జల్లా కోటయ్య, నాగమహేష్, కోటేశ్వరరావు, సురేష్, రామారావు, రాణీ, నాగేందర్, వెంకటేశ్వర్లు, గంగాభవాని, నరేంద్ర సింహ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మట్టి తవ్వకాలను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

మధిర రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగవీడు వద్ద సాగర్‌కాల్వను తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని, ఈ మట్టి తవ్వకాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జడ్పీ చైర్మన్, జిల్లా బీఆర్‌ఎస్ నేత లింగాల కమల్ రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధిర మండలం వంగవీడు వద్ద మట్టి తవ్వకాలు జరిపిన సాగర్ కెనాల్‌ను నాయకులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, ఐలూరి ఉమామహేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, వేణు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులు నిర్వహించొద్దు: డీఎంహెచ్‌వో

చింతకాని, జనవరి10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులు గ్రామాల్లో ఎటువంటి హెల్త్ క్యాంపులు నిర్వహించకూడదని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో ఓ ప్రైవేటు హాస్పటల్‌కు సంబంధించిన సిబ్బంది గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు శిబిరం వద్దకు చేరుకుని విచారించగా ఎటువంటి అనుమతులు లేకుండా క్యాంపు నిర్వహిస్తున్నారని దృష్టికి వచ్చిందన్నారు. వైద్యాధికారి తనిఖీలకు వస్తున్నారన్న సమాచరంతో సిబ్బంది పరికరాలతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే ఆరోగ్య శిబిరాలను ప్రజలు నమ్మకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అల్తాఫ్, సాయి కుమార్ ఉన్నారు.

నేడు న్యూలిటిల్‌ప్లవర్ వార్షికోత్సవం

వైరా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ప్లవర్ పాఠశాల వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. కాళోజి అవార్డు గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ రావులపాటి సీతరాం, ఏసీపీ రెహ్మాన్ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వార్షికోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

బోనకల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తెలంగాణ రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం రైతుసంఘ జాతీయ నాయకులు జగ్జీత్ దాల్లే వాలా డిమాండ్లను అమలు చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘ డివిజన్ నాయకుడు దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ 44 రోజులుగా నిరవధి క నిరాహారదీక్ష చేస్తున్న రైతుసంఘ జాతీ య నేత జగ్జీత్ దాల్లే ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరి రమేష్, కొమ్మినేని నాగేశ్వరరావు, గుడ్డూరి ఉమ, పత్తి రాధాకృష్ణ, వెంకట నర్సయ్య, నరేష్ పాల్గొన్నారు.

కళ్ల పరిరక్షణకు జాగ్రత్తలు అవసరం

సత్తుపల్లిరూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కళ్ల పరిరక్షణకు ప్రతిఒక్కరూ మరింత జాగ్రత్తలు అవసరమని విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి బద్రుద్దీన్ అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శరత్ మాక్సివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన వారికి కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది విక్రమ్ సింగ్, భాషా, ప్రశాంత్, శ్రీకాంత్, సంఘ బాధ్యులు కేశవరెడ్డి, రామిశెట్టి సుబ్బారావు, అద్దంకి వెంకటరత్నం, ప్రకాశరావు, సాంబశివరెడ్డి, రత్తయ్య, బాలశౌరి, సత్యనారాయణ రెడ్డి, మధుసూదనరాజు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం: బీజేపీ

మధిర, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాడుతామని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతు భరోసా రూ.15 వేలు, అలాగే భూమి లేని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ కార్యదర్శి పాపట్ల రమేష్, రామిశెట్టి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, మాధవసాయి, రామకృష్ణ పాల్గొన్నారు.